# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి బుధవారం 25-12-2024 సంపుటి : 06 సంచిక : 81 పేజీలు : 8 వెల : రూ 3-00


## వైసీపీ పోరుబాట పోస్టర్ ఆవిష్కరణ

అమరావతి, డిసెంబర్ 24 : రాష్ట్రంలో కరెంటు చార్జీలు పెంపుపై వైఎస్సార్సీపీ పోరుబాట పోస్టర్‌ను మంగళవారం విడుదల చేశారు. ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ విజయసాయిరెడ్డి, గుడివాడ అమర్నాథ్, బూడి ముత్యాల నాయుడు పార్టీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నాయకులు ఈ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడుతూ.. 44 సంవత్సరాల అనుభవాన్ని ప్రజలను మోసం చేయడానికి ఉపయోగిస్తున్నారని మండిపడ్డారు. పెరిగిన విద్యుత్ ఛార్జీలకు నిరసనగా 27వ తేదీన నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. “మేము ఎన్డీఏ పక్షం కాదు, ఇండియా పక్షం కాదు. మేము మొదటి నుంచి న్యూట్రల్‌గానే ఉన్నాం. రాష్ట్ర ప్రయోజనాలే మాకు ముఖ్యం. మేము మొదటి నుంచి చెప్తున్నాం జెమిలి ఎన్నికలు వస్తాయని. జేపీసీలో నేను కూడా ఒక సభ్యుడిని. జేపీసీ ప్రతి రాష్ట్రంలోని పర్యటిస్తుంది. ప్రతి రాజకీయ పార్టీని కలుస్తుంది.




# ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్.. ఆర్థిక నిపుణులతో ప్రధాని భేటీ..!



న్యూఢిల్లీ: వచ్చే ఏడాది పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టనున్నది. బడ్జెట్‌కు సంబంధించి అభిప్రాయాలు, సూచనలను స్వీకరించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ ఆర్థికవేత్తలు, నిపుణులతో సమావేశమయ్యారు. ఫిబ్రవరి 1న లోక్‌సభలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2025-26 బడ్జెట్‌ను పార్లమెంట్‌లో ప్రవేశపెడుతారు. ఈ సమావేశంలో సీతారామన్, నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ సుమన్ బేరీ, నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం, ముఖ్య ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్, సుర్జిత్ భల్లా, డీకే జోషి సహా ప్రముఖ ఆర్థికవేత్తలు సమావేశానికి హాజరయ్యారు.ఇదిలా ఉండగా భారతదేశ 2024-25 ఆర్థిక వృద్ధి మందగమనం నేపథ్యంలో ప్రధాని సమావేశం నిర్వహిస్తున్నారు. సెప్టెంబర్ త్రైమాసికంలో భారత ఆర్థిక వృద్ధి 5.4 శాతానికి పడిపోయింది. దాదాపు రెండేళ్ల కనిష్ఠానికి చేరింది. ఆర్‌బీఐ, రేటింగ్ ఏజెన్సీల అంచనాల కంటే ఘోరంగా తగ్గింది. గతేడాది ఇదే త్రైమాసికంలో జిడిపి ఏకంగా 8.1 శాతం పెరుగుదల చోటుచేసుకుంది. గడిచిన ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో 6.7 శాతానికి పరిమితమైంది. ఈ రెండింటితోనూ పోల్చినా జీడీపీ భారీ తగ్గుదల నమోదవడం ఆందోళన కలిగిస్తున్నది. మరోవైపు రేటింగ్ ఏజెన్సీలు కూడా 6శాతం ఎగువన వృద్ధి ఉండొచ్చని అంచనా వేయగా.. వాటి కంటే తక్కువగా పడిపోవడం గమనార్హం.జీడీపీ 7శాతం పెరుగుతుందని రిజర్వ్ బ్యాంక్ అంచనా వేయగా.. అంచనాలకు మంచి జీడీపీ పతనమైంది. రాబోయే బడ్జెట్‌లో ప్రైవేట్ పెట్టుబడులను ప్రోత్సహించేందుకు కేంద్రం ప్రోత్సాహకాలు ప్రకటిస్తుందా? లేదంటే సంస్కరణలు తీసుకువస్తుందా? అనేది ఆసక్తి నెలకొన్నది. జనవరి 20న అమెరికా అధ్యక్షుడిగా డోనాల్డ్ ట్రంప్ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇటీవల ట్రంప్ భారత్, చైనా, బ్రెజిల్ సహా ఇతర దేశాల వస్తువులపై సుంకాలను పెంచనున్నట్లు హెచ్చరించారు. మరో వైపు ఈ నెల 20న రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలతో ఆర్థిక మంత్రి ప్రీ-బడ్జెట్ సమావేశం నిర్వహించారు. పంజాబ్, కేరళ సహా పలు రాష్ట్రాలకు చెందిన ఆర్థిక మంత్రులు కేంద్రం నుంచి ప్యాకేజీ ప్రకటించాలని కోరారు. దీర్ఘకాలిక మౌలిక సదుపాయాలు, మూలధనం వ్యయం కోసం 50 సంవత్సరాల వడ్డీ లేని రుణాల కేటాయింపును పెంచాలని కేంద్రాన్ని కోరారు.

# ఆంధ్రప్రదేశ్-టోయామా మధ్య అవగాహన ఒప్పందం



అమరావతి: ఆంధ్రప్రదేశ్-టోయామా మధ్య అవగాహన ఒప్పందాన్ని మరోసారి పునరుద్ధరించారు. జపాన్‌లోని టోయామా ప్రాంతానికి చెందిన గవర్నర్ హచిరో నిట్టా నేతృత్వంలోని 14 మంది సభ్యుల బృందం ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించిన విషయం తెలిసిందే. మంగళగిరి ఏపీఐఐసీలో ఆంధ్రప్రదేశ్-టోయామా మధ్య ఒక కొత్త అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా గవర్నర్ హచిరో నిట్టా మీడియాతో మాట్లాడుతూ... 2015లో ఏపీతో ప్రారంభమైన ఈ సహకార సంబంధాలను మరింత పటిష్టం చేసే దిశగా ఒప్పందం కుదిరిందని వివరించారు. వాణిజ్య, వ్యాపార రంగాల్లో పరస్పర సహకారం తీసుకుంటామని చెప్పారు. సాంస్కృతిక సంబంధాలను పెంపొందించుకుంటామని అన్నారు. విద్యార్థులు, పరిశోధకుల మధ్య అనుసంధాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. డిజిటల్ రంగంలో సాంకేతిక సహకారం, ఔషధ తయారీ రంగంలో సహకారం తీసుకుంటామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ఒక జపనీస్ జెన్ గార్డెన్ ఏర్పాటు చేయడానికి సహకరిస్తామని హామీ ఇచ్చారు. విశ్వవిద్యాలయాల మధ్య సహకారం,సాంకేతిక పరిజ్ఞాన మార్పిడిపై ప్రత్యేక దృష్టి సారించామని టోయామా గవర్నర్ నిట్టా తెలిపారు.

# పేర్ని నాని పిటిషన్‌పై హైకోర్టు అభ్యంతరం

అమరావతి, డిసెంబర్ 24 : గోడౌన్ నుంచి రేషన్ బియ్యం మాయం చేసిన వ్యవహారంలో మాజీ మంత్రి పేర్ని నాని , ఆయన కుమారుడు కిట్టు వేసిన పిటిషన్లపై ఏపీ హైకోర్ట్‌లో మంగళవారం విచారణ జరిగింది. విచారణకు హాజరుకావాలంటూ మచిలీపట్నం పోలీసులు ఇచ్చిన నోటీసులను సవాల్ చేస్తూ పేర్నినాని, ఆయన కుమారుడు పేర్ని కృష్ణమూర్తి దాఖలు చేసిన పిటిషన్‌పై ధర్మాసనం విచారించింది. అయితే ఈ నెల 22న విచారణకు హాజరుకావాలని పోలీసులు నోటీసులు ఇచ్చారని న్యాయమూర్తి గుర్తుచేశారు. గడువు ముగిసిన నేపథ్యంలో పిటిషన్ విచారణపై న్యాయమూర్తి అభ్యంతరం వ్యక్తం చేశారు. వ్యాజ్యం ఉపసంహరణకు అనుమతి ఇవ్వాలని, తిరిగి పోలీసులు నోటీసులు ఇస్తే కోర్టును ఆశ్రయించేందుకు వెసులుబాటు ఇవ్వాలని న్యాయస్థానాన్ని న్యాయవాదులు అభ్యర్థించారు. అందుకు న్యాయమూర్తి అంగీకారం తెలిపారు. మచిలీపట్నంలో వైసీపీ నేత పేర్నినాని సతీమణి జయసుధ మచిలీపట్నంలోని తన గోడౌన్‌ను పౌరసరఫరాలశాఖకు




లీజుకిచ్చారు. అయితే ఇందులో నిల్వ చేసిన రేషన్ బియ్యం మాయం అయ్యాయని పేర్కొంటూ చింతం కోటిరెడ్డి అనే అధికారి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా జయసుధపై పోలీసులు కేసు నమోదు చేశారు. మరోవైపు రేషన్ బియ్యం మాయం కేసులో పేర్ని నాని సతీమణి జయసుధ బెయిల్ పిటీషన్ మరోసారి వాయిదా పడింది. పీపీ సెలవులో ఉండటంతో మరోసారి బెయిల్ పిటీషన్‌ను న్యాయమూర్తి ఈనెల 27కు వాయిదా వేశారు. ఈరోజు ప్రాసిక్యూషన్ తరపున కౌంటర్ దాఖలు చేయాల్సి ఉండగా స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ విజయ సెలవు పెట్టారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ హాజరుకాకపోవటంతో పిటిషన్‌ను న్యాయమూర్తి ఈనెల 27కు వాయిదా వేశారు. అలాగే కౌంటర్ దాఖలు విషయంలో పోలీసుల తీరుపై కూడా జడ్జి అసహనం వ్యక్తం చేశారు.పేర్నినాని సతీమణి జయసుధ బెయిల్ పిటిషన్‌పై వాయిదా పడటం ఇది నాలుగోసారి. కాగా.. కృష్ణా జిల్లా మచిలీపట్నం మండలం పొట్లపాలెంలో పేర్ని నాని సతీమణి జయసుధ పేరిట ఉన్న గోదాముల్లో రేషన్ బియ్యం మాయమైన సంగతి తెలిసిందే. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్‌లో సుమారు 187 టన్నుల పీడీఎస్ బియ్యం అక్రమంగా తరలించినట్టు వెలుగులోకి వచ్చింది. ఈ కేసుకు బయటకు వచ్చినప్పటి నుంచి పేర్నినాని కుటుంబం అజ్ఞాతంలోకి వెళ్లిపోయింది. గత పది రోజులుగా పేర్ని నాని సతీమణి జయసుధ అజ్ఞాతంలో ఉన్నారు. కొద్దిరోజుల క్రితం పేర్నినాని బయటకు వచ్చి హైకోర్టును ఆశ్రయించారు. ముందస్తు బెయిల్ మంజూరు చేయాల్సిందిగా హైకోర్టులో పిటిషన్ వేశారు.

## వినియోగదారుల హక్కులపై అవగాహన పెంచుకోవాలి : మంత్రి నాదెండ్ల మనోహర్

అమరావతి, డిసెంబర్ 24 : వినియోగదారుల చట్టంపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని మంత్రి నాదెండ్ల మనోహర్ సూచించారు. వినియోగదారుల హక్కులు, సదుపాయాలపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. ప్రస్తుతం ఆన్‌లైన్ షాపింగ్‌కు అలవాటు పడ్డామని.. ఇక్కడ మోసపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సలహా ఇచ్చారు. వినియోగదారుల హక్కులు మర్చిపోయేలా కొందరు వ్యవహరిస్తున్నారన్నారు. టీ పౌడర్ నుంచి కందిపప్పు వరకు కల్తీ జరుగుతుందని తెలిపారు. పిల్లలు తినే చాక్లెట్లలోనూ కల్తీ జరుగుతుందని చెప్పారు. వీటిని నివారించేందుకు అందరు కృషి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ధాన్యం సేకరణ తర్వాత 24 గంటల్లోనే ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని చెప్పారు. ప్రతి ప్రభుత్వ కార్యక్రమంలో జవాబుదారీతనం ఉండాలని అన్నారు. దీపం -2 పథకం ద్వారా 75 లక్షల గ్యాస్ సిలిండర్లు అందించామని చెప్పుకొచ్చారు. ప్రభుత్వం మాదిరిగానే ప్రతి ప్రైవేట్ సంస్థ జవాబుదారీతనంతో ఉండాలని అన్నారు. చట్టాలు తీసుకువస్తే సరిపోదు, అవి యాక్టివ్‌గా ఉండాలన్నారు. ప్రతి పాఠశాల, కళాశాలలో వినియోగదారుల క్లబ్‌లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఆహార కల్తీ నివారణకు జిల్లాకో ల్యాబ్ ఏర్పాటుకు ఆలోచిస్తున్నామన్నారు. వినియోగదారుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. చట్టంలోని హక్కులను పౌరులు ఉపయోగించుకోవాలని మంత్రి నాదెండ్ల మనోహర్ సూచించారు.

## బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం.. కోస్తాంధ్రకు భారీ వర్షం సూచన

అమరావతి : బంగాళాఖాతంలో ఏర్పడ్డ తీవ్ర అల్పపీడనం వల్ల దక్షిణ కోస్తాలో భారీ వర్షాలుకురుస్తాయని వాతావరణశాఖ అధికారులు వెల్లడించారు. నెల్లూరు, ప్రకాశం, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు పడే అవకాశముందని పేర్కొన్నారు. తీరం వెంబడి బలమైన ఈదురుగాలులు వీస్తాయని , మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని హెచ్చరించారు.రాష్ట్రంలోని కళింగపట్నం, విశాఖపట్నం, గంగవరం, కాకినాడ, మచిలీపట్నం, నిజాంపట్నం, కృష్ణపట్నం, సహా తమిళనాడులోని వివిధ పోర్టుల్లో మూడో ప్రమాద హెచ్చరికను కొనసాగిస్తున్నారు. చేశారు. అల్పపీడనం తీరానికి సమీపంలో కదులుతున్న నేపథ్యంలో మేఘాలు కమ్ముకుని చలిగాలులు వీస్తున్నాయి. దీని ప్రభావంతో గురువారం వరకు రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని అధికారులు వివరించారు.



# జగన్ హయాంలో మరోస్కాం..

## సంచలన విషయాలు బయటపెట్టిన రామ్మోహన్ నాయుడు




శ్రీకాకుళం: జగన్ ప్రభుత్వంలో జరిగిన అవినీతిపై విచారణ జరిపిస్తున్నామని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు నేతృత్వంలో దిశా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో 20 సూత్రాల పథకం చైర్మన్ లంకా దినకర్, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. తమకు రాజకీయ, వ్యక్తిగత కక్షలు ఉండవని చెప్పారు. జలజీవన్ మిషన్, హౌసింగ్ పథకాల్లో అధికారిక లెక్కలకు క్షేత్ర స్థాయి పనులకు పొంతన లేదన్నారు.వైసీపీ ప్రభుత్వంలో అనేక అప్రజాస్వామిక నిర్ణయాలు తీసుకున్నారని అన్నారు. నాటి ప్రభుత్వ వైఫల్యాలు నేటికీ వెంటాడుతున్నాయని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు.కేంద్ర ప్రభుత్వ నిధుల వినియోగంపై దిశా సమావేశంలో చర్చించామని అన్నారు. రాష్ట్రం, కేంద్రంలోనూ ఎన్డీయే ప్రభుత్వం ఉండటం ఏపీకి ప్రయోజనకరంగా ఉంటుందని చెప్పారు. కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో సమస్యలు పరిష్కరించుకుంటామని తెలిపారు.

అటల్ బిహారీ వాజపేయి జయంతి కార్యక్రమం ఢిల్లీలో ఘనంగా నిర్వహిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొంటారని తెలిపారు. వాజ్‌పేయి మంచి సంస్కరణ వాది అని చెప్పారు. చంద్రబాబు, వాజపేయి కాంబినేషన్లో అనేక సంస్కరణలకు నాంది పలికారని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

## కేంద్రంలో వైసీపీ పాత్ర తటస్థమే : ఎంపీ విజయసాయి రెడ్డి

అమరావతి : కేంద్రంలో ప్రస్తుతం వైసీపీ వైఖరి తటస్థంగా ఉందని వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డి పేర్కొన్నారు. ఇండియా కూటమికి గాని, ఎన్డీయే కూటమికి సమాంతర దూరంలో ఉన్నామని వెల్లడించారు. ఈనెల 27న ఏపీ లో విద్యుత్ చార్జీల పెంపుదలను నిరసిస్తూ తలపెట్టిన పోరుబాట పోస్టర్‌ను మంగళవారం విశాఖలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. తాము మొదటి నుంచి న్యూట్రల్‌గానే ఉన్నామని తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాలే తమకు ముఖ్యమని అన్నారు. జమిలి ఎన్నికలు వస్తాయని వైసీపీ ముందునుంచే చెబుతుందని అన్నారు. గుడివాడ అమర్నాథ్ మాట్లాడుతూ అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచబోమని హామీ ఇచ్చిన కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత రూ. 15 వేల కోట్లకు పైగా విద్యుత్ ఛార్జీలు పెంచిందని ఆరోపించారు.వచ్చే నెల నుంచి రూపాయిన్నర వరకు యూనిట్‌పై భారం పడుతుందని అన్నారు. నాణ్యమైన విద్యుత్ , విద్య, వైద్యాన్ని అందిస్తామని చెప్పి నాణ్యమైన మద్యాన్ని అందజేస్తుందని విమర్శించారు.



# ముగిసిన అల్లు అర్జున్ విచారణ.. మరోసారి..

హైదరాబాద్, చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌లో అల్లు అర్జున్ విచారణ ముగిసింది. సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటపై మూడు గంటలు పాటు విచారణ చేసిన పోలీసులు.. అల్లు అర్జున్‌ను 20 ప్రశ్నలు అడిగినట్లు తెలుస్తోంది. మూడున్నర గంటల పాటు అల్లు అర్జున్ స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేశారు పోలీసులు. అవసరమైతే మరోసారి నోటీసులు ఇస్తామని పోలీసులు తెలిపారు. మరోసారి విచారణకు రావాల్సి ఉంటుందని.. అందుబాటులో ఉండాలని అల్లు అర్జున్‌కు పోలీసులు తెలిపారు. పోలీసులు సేకరించిన వీడియోలు, సిసి ఫుటేజ్‌ను ముందు పెట్టి అల్లు అర్జున్‌ను విచారించారు.ఇదిలాఉండగా.. అల్లు అర్జు?న్‌కు కోర్టు మంజూరు చేసిన మధ్యంతర బెయిల్‌ను రద్దు చేయాలని పోలీసులు కోరనున్నట్లు తెలుస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా అల్లు అర్జున్ మీడియాతో మాట్లాడారని.. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ కోర్టులో బెయిల్ రద్దు చేయాలని కోరనున్నట్లు సమాచారం. కాగా, విచారణ అనంతరం చిక్కడపల్లి పీఎస్ నుంచి జూబ్లీహిల్స్ నివాసానికి బయలుదేరారు అల్లు అర్జున్. ఎస్కార్ట్ వాహనంతో చిక్కడపల్లి పీఎస్ నుంచి తన ఇంటికి వెళ్లారు.



# సంపాదకీయం

బుధవారం 25-12-2024

## టాలీవుడ్ కు వరుస కష్టాలు

అడ కత్తెరలో పోక చెక్క.. ఈ సామెత గురించి తెలుసా.. ఇప్పుడు ఈ సామెత లాగానే తెలుగు చిత్ర పరిశ్రమ పరిస్థితి మారిపోయింది. ఇప్పటివరకు పుష్ప వివాదం వల్ల తెలుగు చిత్ర పరిశ్రమ పరిస్థితి మెడవరకే వచ్చేసింది. ఇంకా లాగితే పూర్తిగా మునిగిపోవడం ఖాయమని తెలుస్తోంది.అధికారం కోసం రాజకీయ పార్టీలు ఎన్ని అడ్డదారులైనా తొక్కుతాయి. ఇలాంటి హామీలైనా ఇస్తాయి. ఎలాంటి అవకాశం లభించినా వెంటనే తమకు అనుకూలంగా మార్చుకుంటాయి. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి మధ్య ఉప్పు నిప్పులాగా వ్యవహారం ఉంది. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన నాటి నుంచి ఇప్పటివరకు కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి నాయకులు పోటాపోటీగా విమర్శలు చేసుకుంటున్నారు. ప్రతి విమర్శలు చేస్తున్నారు. దీంతో ఎన్నికల కాలంనాటి పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇవి ఎంత వరకు దారి తీస్తాయో తెలియదు కాని.. ప్రస్తుతానికైతే పరిస్థితి బాగోలేదు. ఇక ముందు బాగుపడుతుందని అంచనా కూడా లేదు. పుష్ప వివాదంలోకి రాజకీయ పార్టీలు ఎంట్రీ ఇవ్వడంతో.. ఒక్కసారిగా అది జటిలంగా మారింది. సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో అల్లు అర్జున్ కు మద్దతుగా భారత రాష్ట్ర సమితి, వైఎస్ఆర్సిపి రంగంలోకి వచ్చాయి. వాటి సోషల్ మీడియా విభాగాలలో అల్లు అర్జున్ కు సంఘీభావం ప్రకటించాయి. ఈ విషయం గురించి తెలుసో, తెలియదో గాని.. అల్లు అర్జున్ ఆ పార్టీల ట్రాప్ లో పడ్డారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.. అందువల్లే ఆయన టార్గెట్ అయిపోయారని.. తన సినీ కెరియర్లో ఎన్నడూ అనుభవించని ఒత్తిడిని చవిచూస్తున్నారని తెలుస్తోంది. పరిస్థితి కూడా ఆయన చేతుల నుంచి దాటిపోయింది. ఆయన భవిష్యత్తు ఏంటో తెలియదు కానీ.. రాజకీయ పార్టీలు ఆయనను వాడుకుంటున్నాయి. తమ ప్రాపకం కోసం అల్లు అర్జున్ కేంద్రంగా రాజకీయాలు చేస్తున్నాయి.సంధ్య థియేటర్ లో తొక్కిసలాట జరిగిన తర్వాత పరిణామాలు వేగంగా మారిపోతున్నాయి. అల్లు అర్జున్ పావుగా వాడుకునేందుకు కొన్ని పార్టీలు రాజకీయం మొదలుపెట్టాయి. టాలీవుడ్ మొత్తం గా కలిసి ప్రభుత్వంపై ఈదురు దాటికి దిగాలని సలహాలిస్తున్నాయి. తమ సోషల్ మీడియా హ్యాండిల్స్ లో ఈ విధమైన ప్రచారం చేస్తున్నాయి. " మొన్న నాగార్జున ఎన్ కన్వెన్షన్ సెంటర్ కూల్చేశారు. నిన్న ఏదో ఘటన సాకు గా చూపి అల్లు అర్జున్ ను ఇబ్బంది పెడుతున్నారు. రేపటి నాడు జరిగేది మీకే.. అందు గురించే జాగ్రత్తపడండి" అంటూ కొన్ని రాజకీయ పార్టీలు పిలుపునిస్తున్నాయి.. వాస్తవానికి టాలీవుడ్ అనేది రంగుల పరిశ్రమ. అది ఒక అద్దాల మేడ లాంటిది. ఎవరినైనా రెచ్చగొడితే.. వారు అదే కోపంలో రాళ్లు వేస్తే కచ్చితంగా పగిలేది టాలీవుడ్ రంగుల మేడనే. అందువల్లే సినీ ప్రముఖులు నిశ్శబ్దాన్ని పాటిస్తున్నారు.. కానీ రాజకీయ పార్టీలు ఊరుకోవు కదా. టాలీవుడ్ ను రోడ్డుమీద లాగడానికి కొన్ని పార్టీలు గట్టిగానే ప్రయత్నాలు చేస్తున్నాయి. గతంలో తాము అధికారంలో ఉన్నప్పుడు చేసిన మేళ్లను గుర్తుకు తెచ్చుకొని.. ప్రస్తుత రేవంత్ ప్రభుత్వం పై ఎదురు దాడికి దిగాలని పిలుపునిస్తున్నాయి. అయితే నాటి ప్రభుత్వ పెద్దలతో అంట కాగిన వారు మొత్తం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో తెలుగు చిత్ర పరిశ్రమ నుంచి ఎవరైనా నిరసన స్వరం వినిపిస్తే.. పరిస్థితి ఎలా ఉంటుందో వారికి తెలుసు. రేవంత్ రెడ్డి ఏం చేస్తారో కూడా తెలుసు. అందువల్లే తెలుగు చిత్ర పరిశ్రమ నిశ్శబ్దంగా ఉంటున్నది. అటు ప్రతిపక్ష పార్టీ చేస్తున్న ఒత్తిడి నుంచి.. అధికార పార్టీ కన్నెర్ర నుంచి తట్టుకోలేక.. మౌనంగా ఉండిపోతున్నది..సీఎం రేవంత్‌రెడ్డి అల్లు అర్జున్ తీరును తప్పు పడుతుండగా, సీఎం సన్నిహితుడైన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు మాత్రం తెలుగు సినిమా ఇండస్ట్రీ హైదరాబాద్‌లోనే ఉండాలని రిక్వెస్ట్ చేశారు. డిసెంబర్ 4న అల్లు అర్జున్ సంధ్య థియేటర్‌కు రావడం, అక్కడ తొక్కిసలాట జరగడం, మహిళ మృతి, బాబు స్పృహతప్పడం వంటి ఘటనలపై హైదరాబాద్ సీపీ సీవీ.ఆనంద్ వీడియో విడుదల చేశారు. దీంతో ఇండస్ట్రీ హైదరాబాద్ నుంచి తరలిపోతుందన్న ప్రచారం జోరందుకుంది. దీనిపై మంత్రి శ్రీధర్‌బాబు స్పందించారు. అల్లు అర్జున్ డిసెంబర్ 4న రోడ్‌షో చేశారా లేదా అనేది వీడియో చూస్తే అర్థమవుతుందన్నారు. పోలీసులు పర్మిషన్ ఇచ్చారా లేదా.. సంధ్య థియేటర్ నుంచి కారులో నిలబడి అభిమానులకు అభివాదం చేయడం తదితర విషయాల్లో వాస్తవాలు అల్లు అర్జున్‌కు కూడా తెలుసని చెప్పారు.సినీ ఇండస్ట్రీని సీఎం టార్గెట్ చేయలేదని శ్రీధర్‌బాబు తెలిపారు. అరెస్ట్ అయినందుకు అల్లు అర్జున్‌ను పరామర్శిస్తున్న సినీ ప్రముఖులు బాధిత కుటుంబాన్ని పట్టించుకోవడం లేదని సీఎం ఆవేదన చెందారన్నారు.అందుకే ఆరోజు జరిగిన ఘటనపై అసెంబ్లీలో బాధతో మాట్లాడారని చెప్పుకొచ్చారు. సినిమా ఇండస్ట్రీ ఇక్కడే ఉండాలన్నారు. ప్రభుత్వం అందించే సబ్సిడీలు, రాయితీల విషయంలో ఎలాంటి వివక్ష ఉండదని స్పష్టం చేశారు.తెలుగు సినిమా ఇండస్ట్రీ తరలిపోతుందని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో మంత్రి శ్రీధర్‌బాబు చేసిన రిక్వెస్ట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీనిపై తెలుగు సినీ అభిమానులు, నెటిజన్లు స్పందిస్తున్నారు. అల్లు అర్జున్‌ను టార్గెట్ చేయడం వెనుక కుట్ర ఉందని చాలా మంది భావిస్తున్నారు. ఈమేరకు కామెంట్ చేస్తున్నారు. పొరపాటున జరిగిన దానికి ఈ కేసులో ఏ11గా ఉన్న అల్లు అర్జున్‌ను అరెస్టు చేయడం ఏంటని ప్రశ్నిస్తున్నారు

## ఎన్.సి.సి.విద్యార్థులు చేసిన సేవలు మరువ లేనివి

### జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 24--దివ్యాంగుల దినోత్సవం రోజున ఎన్. సి. సి. విద్యార్థులు చేసిన సేవలు మరువ లేనివి అని దివ్యాంగుల జిల్లా గౌరవ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ పేర్కొన్నారు. నంద్యాల దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈనెల యందు టౌన్ హాల్ లో నిర్వహించిన ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం రోజు దివ్యాంగులకు విశిష్ట సేవలందించిన రామకృష్ణ డిగ్రీ కళాశాల ఎన్.సి.సి విద్యార్థులకు అభినందించి బహుమతులు అందజేశారు .నంద్యాల దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ జి. రవికృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ జి. రామకృష్ణారెడ్డి,ప్రముఖ న్యాయవాది,తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వెదుర్ల రామచంద్రరావు,రోటరీ మాజీ గవర్నర్ కందుకూరి శ్రీరామ్మూర్తి, ప్రముఖ వైద్యులు డాక్టర్ విజయబాబు, సీనియర్ లయన్స్ క్లబ్ సభ్యులు మహేశ్వర్ రెడ్డి పాల్గొని విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ దాతల సహకారంతో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం రోజున ప్రతి ఏటా భారీ సేవా కార్యక్రమాలను చేస్తున్నామని అయితే వాటిని ఆరోజు దివ్యాంగులకు అందించడంలో, అదేవిధంగా దివ్యాంగులకు ఆ కార్యక్రమంలో విశిష్ట సేవలు అందించిన రామకృష్ణ డిగ్రీ కళాశాల ఎన్.సి.సి. క్యాడేట్స్ సేవలు ప్రశంసనీయమని అన్నారు.డాక్టర్ రామకృష్ణారెడ్డి,వెదుర్ల రామచంద్రరావు,కందుకూరి శ్రీరామమూర్తి ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఏటా దివ్యాంగులకు ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ సేవా కార్యక్రమాలు నిర్వహించడమే కాకుండా దివ్యాంగులకు నిరంతరం తమ కార్యాలయం ద్వారా సహకరిస్తున్న దివ్యాంగుల సంక్షేమ సంఘం సేవలు మరువ లేమన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయబాబు,లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు మహేశ్వరరెడ్డి ,లయన్స్ క్లబ్ అధ్యక్షులు నిజాముద్దీన్, కార్యదర్శి శిరిగిరి రమేష్, ఉపాధ్యక్షులు సోమేశుల నాగరాజు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## బాధితులు అన్ లైన్ లో ను ఫిర్యాదు చేయవచ్చు---

### మోసాలను ఆట కట్టించ వచ్చు






విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 24- నష్ట పోయిన బాధితులు అన్ లైన్ లో ను ఫిర్యాదు చేయవచ్చు అలాగే మోసాలను ఆట కట్టించ వచ్చునని జిల్లా జాయింట్ కలెక్టర్ సి విష్ణు చరణ్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ నందు గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు జరిగిన జాతీయ వినియోగ దారుల దినోత్సవం, 2024 సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ విశిష్ట అతిదిగా విచ్చేసినారు. ఇంచార్జ్ జిల్లా పౌర సరఫరాల అధికారి బి. రాజు అధ్యక్షతన జరిగిన జాతీయ వినియోగ దారుల దినోత్సవం ఉద్దేశించి జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, వినియోగదారుల సంక్షేమం కోసం వారికి అవగాహన కల్పించడం కోసం వారి హక్కులు గుర్తు చేయడం కోసం ప్రతి యేటా ఇట్టి ఉత్సవాలు జరుపబడుచున్నవి. వినియోగదారులకు ఏదోఒక విషయముపై అవగాహన పెంచేందుకు జాతీయ వినియోగదారుల దినోత్సవం ఒక ముఖ్యమైన సందర్భంగా మారిందన్నారు . జాతీయ వినియోగ దారుల దినోత్సవం-2024 వ సంవత్సరం నకు గాను భారత ప్రభుత్వం వారు నిర్ణయించిన ఇతివృత్తం "వినియోగదారు న్యాయపాలనకు వర్చువల్ విచారణలు మరియు డిజిటల్ సౌలభ్యం "వర్చువల్ హియరింగ్ అనగా ఆడియో-విజువల్ ద్వారా నిర్వహించబడే కోర్టు విచారణలు, వర్చువల్ హియరింగ్ యొక్క ప్రయోజనాలు, వర్చువల్ హియరింగ్ యొక్క ప్రతికూలతలు గురించి మరియు ఈకామర్స్ ఫ్లాట్ ఫార్మ్ (ఆన్ లైన్) వస్తువులు తయారుచేస్తున్న కంపెనీలకి, వాటిని కొనుగోలు చేస్తున్న వినియోగదారులకీ మధ్య వారధిగా మాత్రమే ఉంటాయి. కేవలం విశ్వసనీయత ఆధారంగా కొనుగోలుదార్లు కొనుగోలు చేయాలనీ, ప్రతి వినియోగదారుడు డిజిటల్ లావాదేవీలు మరియు సమాచార మార్పిడి చేసేటప్పుడు కొన్ని స్వీయ జాగ్రత్తలు పాటించాలని, తాను కొనుగోలు చేసిన వస్తు సేవల విషయంలో మోసపోయిన వినియోగదారులు అందుబాటులో ఉన్న పరిష్కార వేదికలను ఆశ్రయించడానికి ఏమాత్రం వెనుకాడకూడదు. ప్రతి వినియోగదారుడు వినియోగదారుల రక్షణ చట్టం-2019 పట్ల సరైన అవగాహన కలిగి ఉండాలి. ఒకవేళ వస్తు సేవల కొనుగోలు విషయంలో మోసపోతే సంభందిత అధికారులకు ఫిర్యాదు చేయడానికి ముందుకు రావాలి. మన నిర్లిప్తత మార్కెట్ మోసాలకు ఆజ్యం పోసినట్లవుతుంది. కాబట్టి మనం చేసే ఫిర్యాదు వల్ల మనకే కాదు అందరికి ఉపయోగం . ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవ సాయ అధికారి మరియు సహాయ పౌర సరఫరాల అధికారి రవి బాబు, జిల్లా వినియోగ దారుల అధ్యక్షుడు అమీర్ బాష, విజయ కుమార్, బొల్లు ప్రసాద్, రజనికాంత్, శ్రీనివాసులు, సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ లు ప్రసాద్ రావు, శేఖర్ రెడ్డి ఫకీర్ అహ్మద్, కిషోర్ కుమార్, నాగేశ్వర్ రెడ్డి మరియు జిల్లా నలుమూలల నుండి విద్యార్థిని, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## 3రోజుల నుంచి ఒకే చోట భూకంపమా...

ఒంగోలు, డిసెంబర్ 24,ప్రకాశం జిల్లాలో వరసగా భూమి కంపిస్తుంది. మూడు రోజుల పాటు వరసగా భూప్రకంపనలు రావడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. సోమవారం కూడా భూ ప్రకంపనలు కనిపించాయి. ముండ్లమూరు మండలంలో ఈరోజు ఉదయం 10.24 గంటలకు భూమి కంపించినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. దీంతో ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు పరుగులు తీశారు. భయంతో బయటే చాలా సేపు వరకూ వేచి ఉన్నారు. అలాగే ఇళ్లలో వస్తువులు కూడా కిందపడిపోవడంతో ప్రజలు ఇలా వరసగా భూమి కంపించడంపై చర్చించుకుంటున్నారు. మూడు రోజుల నుంచి భూప్రకపంనలు ఆందోళనలకు గురి చేస్తున్నాయి. శని, ఆది, సోమవారాలు ప్రకాశం జిల్లాలో భూప్రకంపనలు అలజడి రేపాయి. వరసగా మూడు రోజుల పాటు భూమి కంపించడానికి కారణాలపై అధికారులను అడిగే ప్రయత్నాన్ని అక్కడి వారు తెలుసుకుంటున్నారు. ప్రకాశం జిల్లాలోని కురిచేడు, ముండ్లమూరు, తాళ్లూరు మండలంలోని పలు గ్రామాల్లో భూమి కంపించింది. గతంలో ఎన్నడూ లేని విధంగా భూమి కంపించడంతో ఇక్కడ ఉండటం శ్రేయస్కరమేనా? అన్న అనుమానాలు జనంలో కలుగుతున్నాయి. అయితే ఇవి భూమి లోపల జరిగే మార్పుల కారణంగానే స్వల్ప కదిలికలు వస్తుంటాయని, ఇది భూకంపం కాదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ప్రజలు ఎవరూ ఆందోలన చెందాల్సిన అవసరం లేదని, తమ దైనందిన కార్యక్రమాలను చేసుకోవచ్చని అధికారులు సూచిస్తున్నారు.

## ఏపీలో కన్సెల్టీన్సీల రాజ్యం

గుంటూరు, డిసెంబర్ 24,ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ యంత్రాంగం కన్సల్టెంట్ల గుప్పెట్లో చిక్కుకుందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నా, నైపుణ్యం పేరుతో లక్షలకు లక్షలు జీతాలు చెల్లించి స్టేట్ సర్వీస్ అధికారులపై పెత్తనం చేయడానికి కన్సల్టెంట్లను పాలనా వ్యవస్థలో చొప్పిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఆంధ్రప్రదేశ్ ప?రభుత్వంలో కొన్నేళ్లుగా ఈ తంతు యథేచ్ఛగా సాగుతోంది. పార్టీలు, ప్రభుత్వాలతో సంబంధం లేకుండా ప్రభుత్వ వ్యవస్థల్లో మధ్యవర్తుల చొరబాటు అంతకంతకు ఎక్కువైపోతోంది. ప్రభుత్వ విభాగాల్లో రకరకాల కారణాలతో కన్సల్టెంట్ల నియామకం కొన్నేళ్లుగా సాగుతోంది.రాష్ట్ర విభజన తర్వాత ఆలిండియా సర్వీస్ అధికారుల కంటే ఎక్కువ జీతాలు చెల్లించి మరీ కన్సల్టెంట్లను నియమించుకునే సాంప్రదాయం మొదలైంది. ప్రభుత్వ ఉద్యోగులపై పాలకులకు నమ్మకం లేకపోవడం, తాము చెప్పినట్టు చేయడం వంటి కారణాలతో కన్సల్టెంట్లకు పాలకులు మొగ్గు చూపుతున్నారు.ఆంధ్రప్రదేశ్‌లో ఏ పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్నా, బ్యూరోక్రసీలో కన్సల్టెంట్ల హవా మాత్రం తగ్గడం లేదు. ముఖ్యమంత్రి ని ప్రసన్నం చేసుకునేందుకు అఖిల భారత స్థాయి అధికారులు అంతర్జాతీయ కన్సల్టెంట్లపై ఆధారపడటంతో ప్రభుత్వ డేటాను అందమైన ప్రెజెంటేషన్లుగా మార్చేసి అంకెల గరడీతో మభ్య పెట్టడం కొందరు అధికారులకు అలవాటుగా మారిపోయింది.పాలనలో సంస్కరణలు, ప్రజలకు మెరుగైన సేవలు, పారదర్శకత, ప్రజా ప్రయోజనాలు లక్ష్యంగా పనిచేయాల్సిన అధికార యంత్రాంగంలో కొత్త వ్యవస్థలు చొరబడటం, దానినే పాలనా సంస్కరణలుగా భ్రమింప చేయడటం కొన్నేళ్లుగా రివాజుగా మారింది. పార్టీలు ప్రభుత్వాలు మారినపుడల్లా అవే కన్సెల్టెన్సీ సరికొత్త ప్రతిపాదనలు ప్రణాళికలతో రంగురంగుల పవర్ పాయింట్ ప్రెజెంటేషన్లతో పాలనా యంత్రాంగంలోకి చేరిపోతున్నాయి.ఏపీలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గతంలో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేసి కన్సల్టెన్సీల నియామకంపై ముఖ్యమంత్రి స్థాయిలో అమోదం లభించిన తర్వాత బయటి వ్యక్తులను ప్రభుత్వ వ్యవస్థలోకి కన్సల్టెంట్లుగా తీసుకునేలా జీవో నంబర్ 86ను ఆర్థిక శాఖ జారీ చేసింది.ప్రభుత్వ పాలనా వ్యవస్థలో కీలకమైన శాఖలకు అధిపతులుగా ఆలిండియా సర్వీస్ అధికారులు ఉంటే, వారి కింద వివిధ హోదాల్లో రాష్ట్ర సర్వీస్ అధికారులు పనిచేస్తుంటారు. రాష్ట్ర ప్రభుత్వ అధికారుల్లో సర్వీస్‌తో పాటు పదోన్నతులతో జాయింట్ డైరెక్టర్లు, అడిషనల్ డైరెక్టర్ స్థాయి వరకు చేరుకుంటారు. సచివాలయాల్లో అయితే వివిధ హోదాల్లో సెక్రటరీలు ఉంటారు.ఈ క్రమంలో కొందరు ఆలిండియా సర్వీస్ అధికారులకు రాష్ట్ర స్థాయి అధికారులపై నమ్మకం లేకపోవడం, స్టేట్ సర్వీస్ అధికారుల్లో చాలామంది రిటైర్మెంట్ వయసుకు దగ్గర్లో ఉండటంతో శాఖాధిపతుల అంచనాలకు అనుగుణంగా నివేదికలు, రిపోర్టులు తయారు చేసే పరిస్థితులు లేవు. కొన్ని శాఖల్లో అధికారులకు పవర్ పాయింట్ తయారు చేయడం, ఎక్సెల్ షీట్లలో డాటాను విశ్లేషించడం వంటి నైపుణ్యాలు కూడా ఉండవు. సరిగ్గా ఈ పరిస్థితుల్ని అనువుగా మార్చుకుని కొన్నేళ్లుగా ప్రభుత్వ శాఖల్లో కన్సల్టెంట్లు చొరబడటం మొదలైంది.ప్రభుత్వ శాఖల్లో విధాన పరమైన నిర్ణయాలను తీసుకోవడం నుంచి వాటి అమలు వరకు క్షేత్ర స్థాయి నుంచి వచ్చే సమాచారాన్ని క్రోడీకరించి నివేదికలు తయారు చేసి, వాటిని అందమైన పవర్ పాయింట్ ప్రజెంటేషన్లుగా మలచి కొత్త పథకాలకు రూపుదిద్దడంలో కన్సల్టెన్సీల పాత్ర మొదలవుతోంది. రాష్ట్ర సర్వీస్ అధికారులతో పనులు చేయించడం కంటే బయటి వారితో పనిచేయించడం, తాము కోరుకున్న విధంగా నివేదికలు రూపొందించడం శాఖాధిపతులకు సులువుగా మారింది.కన్సల్టెంట్లు సబ్జెక్ట్ నిపుణుడు అయితే ఫర్లేదు కానీ కొన్నేళ్లుగా కన్సల్టెన్సీల నియామకమే ఫార్సుగా మారిందనే ఆరోపణలు ఉన్నాయి. స్టేట్ సర్వీస్ అధికారులకు క్షేత్ర స్థాయి అవసరాలు, వనరులు, ప్రాక్టికల్‌గా ఉండే ఇబ్బందులపై అవగాహన ఉన్నా వారి సేవల్ని వినియోగించుకోవడం లేదు. స్టేట్ సర్వీస్ అధికారుల నివేదికలను అంగీకరించడానికి ఆలిండియా సర్వీస్ అధికారుల అహం అడ్డుగా మారుతోంది. సరిగ్గా ఇదే బలహీనతను అడ్డం పెట్టుకుని ప్రభుత్వ విభాగాల్లో కన్సల్టెన్సీ చొరబాటు అధికం అయ్యింది.ఇక కన్సల్టెన్సీల నియామకంలో కమిషన్ల పర్వం ఉంటుందనే ఆరోపణలు కూడా లేకపోలేదు. ఈ మొత్తం వ్యవహారంలో సంబంధిత శాఖల మంత్రుల ప్రమేయం కూడా ఉండదు. శాఖాధిపతులు, కమిషనర్ల నిర్ణయం మీదే వీటి నియామకాలు జరిగిపోతాయి. కన్సల్టెంట్లపై పర్యవేక్షణ బాధ్యతలు ఎవరివనే విషయంలో జవాబుదారీతనం తీసుకోడానికి అధికారులు సుముఖంగా ఉండరు. ఆ క్షణానికి ప్రభుత్వ అధినేతను మెప్పించడం, మార్కులు కొట్టేయడంపైనే శాఖాధిపతులైన అధికారుల దృష్టి ఉంటుంది.

## రేషన్ బియ్యం స్మగ్లింగ్ చేస్తుంది ఎవరు

కాకినాడ, డిసెంబర్ 24, ఆంధ్రప్రదేశ్ లో కొన్ని రోజులుగా రేషన్ బియ్యం స్మగ్లింగ్ పై పెద్దయెత్తు చర్చ జరుగుతుంది. ఇంతకీ ఈ రేషన్ స్మగ్లింగ్ ఎలా జరుగుతుంది? ఎవరు చేస్తున్నారు? అన్నదానిపై అందరికీ అనుమానాలున్నాయి. కొన్నేళ్ల నుంచి ఈ తంతు జరుగుతుంది. చెప్పాలంటే గత ఐదేళ్ల నుంచి మాత్రమే కాదు.. కొన్ని దశాబ్దాల నుంచి కూడా ఈరేషన్ బియ్యం అక్రమంగా విదేశాలకు రవాణా అవుతున్నట్లు చెబుతున్నారు. కొన్ని వేల కోట్ల రూపాయల విలువైన రేషన్ బియ్యం ఏపీలోని వివిధ పోర్టుల నుంచి విదేశాలకు ఎగుమతి అయిందన్నది వాస్తవం. కేవలం ఏపీ నుంచి మాత్రమే కాదు ఇతర రాష్ట్రాల నుంచి కూడా ఈ బియ్యం ఇక్కడకు తీసుకు వచ్చి విదేశాలకు ఎగుమతి చేస్తున్నట్లు అధికారుల తనిఖీల్లో కనుగొన్నారు.పేదలు పట్టెడన్నం తిన్నాలన్న ఉద్దేశ్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రేషన్ బియ్యాన్ని నిరుపేదలకు అందిస్తున్నారు. రేషన్ దుకాణాల నుంచి తెలుపు రంగు కార్డు ఉన్న వారికి మాత్రమే రేషన్ బియ్యం అందిస్తారు. రాష్ట్రంలో 1.47 లక్షల మంది వరకూ రేషన్ కార్డుదారులున్నారు. వీరందరిలో కొత్తలో రేషన్ బియ్యం తాము ఇంట్లో వినియోగించుకోవడానికి తీసుకునే వారు. కానీ రాను రాను కొనుగోలు శక్తి పెరగడంతో పాటు రేషన్ బియ్యం నాసిరకమైనవిగా భావించడంతో దానిని తీసుకోవడం వృధా అన్న అభిప్రాయానికి వచ్చారు. కాదనలేని వాస్తవం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వలు కేవలం పేదలకు ఉచిత బియ్యం కోసం సంవత్సరానికి సగటున ఏడాదికి 16 వేల కోట్ల రూపాయల నిధులు వెచ్చిస్తున్నాయి.ప్రస్తుతం దాదాపు 10 వేల కోట్లు కేంద్రానికి, 6 వేల కోట్లు రాష్ట్రానికి ఉచిత బియ్యం కోసం వ్యయం అవుతుందన్నది వాస్తవం. గడచిన 5 సంవత్సరాలలో రమారమి మొత్తం 80 వేల కోట్లు ఖర్చు అయితే కేంద్ర ప్రభుత్వం 50 వేల కోట్లు మరియు రాష్ట్ర ప్రభుత్వానికి 30 వేల కోట్లు ఖర్చు అయిందని లెక్కలు చెబుతున్నాయి.కిలో బియ్యం 43.50 రూపాయలు ఖర్చు పెట్టి సివిల్ సప్లైస్ ద్వారా పేదలకు బియ్యం రెండు రూపాయలకే ఇస్తుంటే అందులో తక్కువ మంది తీసుకుంటున్నార. మిగిలిన బియ్యం రాష్ట్రంలోని మొత్తం కోటి 47లక్షల రేషన్ కార్డు దారుల్లో మూడో వంతు మంది కూడా ఆహారంగా వాడటం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది.

# కడపలో కుర్చీలాట

కడప, డిసెంబర్ 24, కడప మున్సిపల్ కార్పొరేషన్ సర్వ సభ్య సమావేశంలో మళ్లీ కుర్చీ కోసం రసాభాస జరిగింది. టీడీపీ ఎమ్మెల్యే మాధవీ రెడ్డి ప్రొటోకాల్ పాటించడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కడప మున్సిపల్ కార్పొరేషన్ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే మాధవీరెడ్డికి వేదికపై మరోసారి కుర్చీ వేయలేదు. ఈ విషయంపై వైసీపీ మేయర్‌ను ఎమ్మెల్యే నిలదీయడంతో కార్పొరేషన్ సమావేశం రసాభాసగా మారింది. తనకు కుర్చీ వేసేంత వరకు నిలబడే ఉంటానని ఎమ్మెల్యే మాధవీ రెడ్డి కడప మేయర్ పోడియం వద్ద నిరసన తెలిపారు. మహిళలను అవమానిస్తే మీ పార్టీ అధినేతకు సంతోషం కలుగుతుందా అని ఎమ్మె?ల్యే ప్రశ్నించారు.మేయర్ సీటు పక్కన తనకు కుర్చీ వేయాలని ఎమ్మెల్యే మాధవీ రెడ్డి ఆందోళనకు దిగడంతో కార్పొరేషన్ సమావేశం రణరంగంగా మారింది. సమావేశాన్ని మధ్యాహ్ననికి వాయిదా వేసినా పరిస్థితి కుదుటపడకపోవడంతో.... వైసీపీ సభ్యులు బాయికాట్ చేశారు. అనంతరం మేయర్ సురేష్ బాబు బయటకు వెల్లిపోయారు. దీంతో ఉదయం నుంచి సీటు జరిగిన ఫైట్ ముగిసింది. అంతకు ముందు టీడీపీ-వైసీపీ కార్పొరేటర్ల ఘర్షణతో కార్పొరేషన్‌లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయిసమావేశం అనంతరం ఎమ్మెల్యే మాధవీ రెడ్డి మీడియాతో మాట్లాడారు. కడప కార్పొరేషన్ నేటి సమావేశంచరిత్రలో నిలిచిపోతుందన్నారు. అజెండాపై చర్చ జరపకుండానే బిల్లులు ఆమోదించారని మండిపడ్డారు. ఈ సమావేశంతో ప్రజాధనం దుర్వినియోగం చేశారన్నారు. మేయర్ ఓ నియంతలా వ్యవహరిస్తు?న్నారని ఆరోపించారు. మహిళ ఎమ్మెల్యే అంటే గౌరవం లేదని, కడప కార్పొరేషన్ రాయించుకున్నట్లు వ్యవహారిస్తున్నారన్నారు. సమావేశంలో వైసీపీ కార్పొరేటర్లు హంగామా చేశారన్నారు. కొందరు కార్పొరేటర్లు టీడీపీలో చేరారని జీర్ణించుకోలేక కుర్చీ డ్రామా ఆడుతున్నారని ఆరోపించారు. కార్పొరేషన్ లో కనీసం వీధి కుక్కలను కూడా అరికట్టలేని పరిస్థితి ఉందన్నారుఎమ్మెల్యే మాధవీరెడ్డి నియంతలా వ్యవహరిస్తున్నారని కడప మేయర్ సురేష్ బాబు ఆరోపించారు. కడప మునిసిపల్ కార్పొరేషన్ సర్వ సభ్య సమావేశంలో ఎమ్మెల్యే గలాటా చేశారన్నారు. తనకు కుర్చీ వేయలేదని ఎమ్మెల్యే సమావేశాన్ని అడ్డుకున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే దౌర్జన్యానికి పాల్పడి సమావేశ అజెండా పేపర్లను చించివేశారన్నారు. ఎమ్మెల్యేకు ప్రజా సమస్యలపై చిత్తశుద్ధి లేదన్నారు. మిగిలిన కార్పొరేషన్లలో ఎమ్మెల్యేలు, మంత్రులు ఎక్కడ కూర్చుంటున్నారో చెప్పాలన్నారు. మొదటి సారి ఎమ్మెల్యేగా గెలిచారని గౌరవిస్తే తన ఇంటిపైనే చెత్త వేయించారని ఆరోపించారు.వందలాది మంది కార్యకర్తలతో కార్పొరేషన్ పై దండయాత్ర చేశారని మేయర్ విమర్శించారు. కార్పొరేటర్లపై నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే, ఫిరాయింపు కార్పొరేటర్లను సస్పెండ్ చేసినా సమావేశం నుంచి బయటకు వెళ్లలేదన్నారు.నవంబర్ 7న జరిగిన కడప కార్పొరేషన్ సర్వసభ్య సమావేశంలో కూడా కుర్చీ వివాదం నెలకొంది. ఈ సమావేశంలో మేయర్ పక్కన తనకు కుర్చీ వేయలేదని ఎమ్మెల్యే మాధవీ రెడ్డి మండిపడ్డారు. మేయర్ ఛాంబర్‌లో ఇద్దరు టీడీపీ ఎమ్మెల్యేలకు కుర్చీలు తీసేశారని, ప్రొటోకాల్ పాటించాలని ఎమ్మెల్యే ఆరోపించారు. దీంతో కుర్చీల వివాదం నెలకొంది.

# పోరాటానికి వైసీపీ రెడీ

విజయవాడ, డిసెంబర్ 24, జగన్ జంగ్ సైరన్ మోగించారు. కూటమి ప్రభుత్వానికి ఆరు నెలలు సమయం ఇచ్చిన వైసీపీ చీఫ్.. ఇకపై ప్రజల పక్షాన ప్రభుత్వంపై పోరాడాలని డిసైడ్ అయ్యారు. అందుకు కరెంట్ ఛార్జీల పెంపు అంశాన్ని అస్త్రంగా వాడుకోవాలని నిర్ణయించారు. కరెంటు ఛార్జీలపై డిసెంబర్ 27న పోరుబాట పట్టాలని పిలుపునిచ్చారు.వైఎస్సార్సీపీ చీఫ్ జగన్‌మోహన్ రెడ్డి తాజాగా కీలక నిర్ణయం తీసుకున్నారు. లాభం లేదు.. ఇక ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ప్రభుత్వంపై పోరాడటానికి ఇన్నాళ్లు వేచిచూసిన జగన్.. కరెంట్ ఛార్జీల అస్త్రంతో రంగంలోకి దిగుతున్నారు. కూటమి ప్రభుత్వంపై పోరు చేయడానికి ఇదే సరైన సమయం అని భావించిన జగన్.. ఈ నెల 27న రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. దీనికి సంబంధించిన పోరుబాట పోస్టర్‌ను వైసీపీ నేతలు ఆవిష్కరించారు.డిసెంబర్ 21న వైఎస్ జగన్ పుట్టిన రోజు వేడుకలు జరిగాయి. అయితే.. ప్రజలు, కార్యకర్తల నుంచి పెద్దగా స్పందన ఉండదని అంతా భావించారు. కానీ.. అనుహ్యంగా ఏపీలోని గల్లీలు మొదలు.. లండన్‌లోని వీధుల వరకు జగన్ బర్త్‌డే వేడుకలు జరిగాయి. దీంతో వైసీపీ మంచి ఊపులో ఉంది. ఇదే ఊపులో ప్రభుత్వంపై పోరాటం ప్రారంభించడం సరైన సమయమని జగన్ భావించినట్టు తెలిసింది. కేడర్ యాక్టివ్‌గా ఉన్నప్పుడే ప్రభుత్వంపై పోరాటం చేయడం రాజకీయంగా మంచిదని భావించినట్టు తెలిసింది. అందుకే డిసెంబర్ 22న ఈ కార్యక్రమాన్ని ప్రకటించారు.కూటమి పార్టీలు ఎన్నికల ముందు చాలా హామీలు ఇచ్చాయి. ముఖ్యంగా సూపర్ సిక్స్ బాగా ప్రాచుర్యం పొందింది. అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు, ఆడబిడ్డకు ప్రతి నెలా రూ.1500, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, డీఎస్సీ ప్రకటన వంటి ప్రధాన హామీలు ఉన్నాయి. వీటిని ప్రభుత్వం ఇంకా అమలు చేయలేదు. ఏడాదికి 3 సిలిండర్ల పథకాన్ని మాత్రం ప్రారంభించింది. ఇన్ని అంశాలు ఉన్నా.. జగన్ కరెంట్ ఛార్జీల పెంపు ఇష్యూను ఎంచుకున్నారు. ఎందుకంటే.. కరెంట్ ఛార్జీల అంశం రాష్ట్రంలో ఎక్కువమందిపై ప్రభావం చూపుతుందని.. దీని ద్వారా ప్రజలకు దగ్గర కావొచ్చని వైసీపీ భావిస్తున్నట్టు తెలిసిందికూటమి ప్రభుత్వ 6 నెలల పాలనపై జగన్ క్షేత్రస్థాయి నుంచి రిపోర్ట్ తెప్పించుకున్నట్టు తెలుస్తోంది. చాలా వర్గాలు ప్రభుత్వంపై వ్యతిరేకంగా ఉన్నట్టు జగన్‌కు రిపోర్ట్‌లు వచ్చాయని సమచారం. ఎక్కువమంది కరెంట్ ఛార్జీల పెంపు అంశంపై గుర్రుగా ఉన్నట్టు జగన్ భావిస్తున్నట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో.. కరెంట్ ఛార్జీల పెంపుపై పోరు చేయాలని నిర్ణయానికి వచ్చినట్టు వైసీపీ నేతలు చెబుతున్నారు.కరెంట్ ఛార్జీలపై పోరు తర్వాత మరిన్ని నిరసన కార్యక్రమాలు చేపట్టాలని జగన్ భావిస్తున్నట్టు తెలుస్తోంది. డిసెంబర్ 27న తలపెట్టిన కార్యక్రమం విజయవంతం అయితే.. దానిపై వచ్చిన స్పందన ఆంధారంగా మార్చి మాసంలో మరో అంశంపై పోరు చేయాలని ఆలోచిస్తున్నట్టు సమాచారం. అందుకే 27న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ ఆఫీసు నుంచి అన్ని నియోజకవర్గాల ఇంఛార్జ్‌లను ఆదేశాలు వెళ్లినట్టు తెలుస్తోంది.ఎన్నికల ఫలితాల తర్వాత చాలా నియోజకవర్గాలకు చెందిన నాయకులు వైసీపీకి రాజీనామా చేశారు. కీలక ప్రాంతాల్లో లీడర్లు లేరు. దీంతో ఆయా నియోజకవర్గాల్లో కార్యక్రమాలు నిర్వహించడం ఇప్పుడు వైసీపీ కష్టంగా మారింది. అయితే.. ఈ కార్యక్రమం తర్వాత ఖాళీగా ఉన్న నియోజకవర్గాలకు ఇంఛార్జ్‌లను నియమించే అవకాశం ఉందని తెలుస్తోంది. నిరసన కార్యక్రమాల నిర్వహణకు కేడర్ సమీకరణ, ఇతర విషయాలను చూసుకోవడానికి ముందుండే నాయకులనే ఇంఛార్జ్‌లుగా నియమిస్తారని సమాచారం.

# మూడేళ్లలో అమరావతి పూర్తి



విజయవాడ, డిసెంబర్ 24, మూడేళ్లలో ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అభివృద్ధి పనులు పూర్తి చేయడానికి టీడీపీ కూటమి ప్రభుత్వం సంకల్పించింది. రాజధాని అభివృద్ధికి అయ్యే వ్యయ భారాన్ని ప్రజలపై ఒక్క పైసా కూడా వేయమని, అమరావతి భూములు అమ్మగా వచ్చే సొమ్మునే రుణాలు తీర్చేందుకు ఉపయోగిస్తామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ వెల్లడించారు.రాజధాని అమరావతి అభివృద్ధి పనులకు, టిడ్కో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన నారాయణ రాష్ట్ర రాజధాని అమరావతి జోన్7, 10 లే అవుట్ల రోడ్ల నిర్మాణ పనులను రూ.2,723 కోట్లతో చేపట్టేందుకు సీఆర్డీఏ ఆమోదం లభించిందని మంత్రి తెలిపారు. రాజధాని అమరావతి అభివృద్ధికై ఇప్పటి వరకూ రూ.47,288 కోట్ల విలువైన పనులకు సీఆర్డీఏ సమావేశంలో ఆమోదం తెలిపడం జరిగిందన్నారు. మిగిలిన అభివృద్ధి పనుల్లో కొన్నింటికి ఈ నెలాఖరు లోపు, మిగిలిన వాటికి వచ్చేనెలలోపు ఆమోదం తెల్పి, జనవరి15 లోగా అన్ని పనులకు టెండర్లు పిలిచి పనులు చేపట్టనున్నట్లు మంత్రి తెలిపారు.' ఏ దేశానికైనా, రాష్ట్రానికి కైనా ఒక రాజధాని తప్పని సరిగా ఉంటుంది. అదే విధంగా ఆంధ్రప్రదేశ్‌కు అమరావతిని రాజధానిగా ఎంపిక చేయడం జరిగింది. అమరావతిని ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి పర్చేందుకు మా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా అమరావతి అభివృద్ధికి అయ్యే వ్యయ భారాన్ని ప్రజలపై ఒక్క పైసా కూడా వేయడం లేదు. పూలింగ్ ద్వారా రైతుల నుంచి సేకరించిన భూములు అమ్మగా వచ్చే సొమ్ముతోనే అమరావతి అభివృద్ధికై తీసుకున్న రుణాలు తీర్చేందుకు చర్యలు చేపడుతాం. ఈ విషయంలో ఎటువంట అపోహలకు తావులేదు. ఎవరు ఎటువంటి విమర్శలు చేసిన ప్రజలు నమ్మవద్దు. రాష్ట్రంలోని 26 జిల్లాల సమాన అభివృద్ధికి 2014-19 మద్య కాలంలోనే తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకున్నాం.రాష్ట్ర పునర్విభజనలో భాగంగా రాష్ట్రానికి వచ్చిన పలు కేంద్ర సంస్థలను సమానంగా అన్ని జిల్లాలకు కేటాయించడం జరిగింది. విజయనగం జిల్లాకు గిరిజన విశ్వవిద్యాలయాన్ని, విశాఖపట్నం జిల్లాకు ఐఐఎం, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీని, కాకినాడకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెన్ ట్రేడ్‌ను, తాడేపల్లిగూడెంకు నిట్‌ను, మంగళగిరికి ఎయిమ్స్‌ను, విజయవాడకు నేషనల్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ డిజైన్, తిరుపతికి ఐఐటి, ఐజర్ లను, కర్నూలుకు ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, డిజైన్, మ్యాన్యుప్రాక్చరింగ్ సంస్థను, అనంతపురానికి సెంట్రల్ యూనివర్సిటీని కేటాయించడం జరిగిందిఇదే విధంగా విశాఖపట్నంలో టీసీఎస్, గూగుల్ వంటి సంస్థలతో పాటు గత ప్రభుత్వం తరమేసిన లూలూ గ్రూప్‌ను మళ్లీ వెనక్కు తీసుకొస్తున్నాం. కర్నూలులో 350 ఎకరాల్లో డ్రోన్ హబ్‌ను ఏర్పాటు చేస్తున్నాం. రాయలసీమ జిల్లాల్లో మ్యాన్యుప్యాక్చరింగ్ యూనిట్లను ఏర్పాటు చేస్తాం. అవకాశం ఉన్న చోటల్లా పోర్టులను అభివృద్ధి పర్చేందుకు చర్యలు చేపడుతాం. పోర్టులు అభివృద్ధి అయ్యే ప్రతి చోటా అమరావతి తరహాలో ల్యాండ్ పూలింగ్ ద్వారా శాటిలైట్ సిటీలను అభివృద్ధి పర్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం' అని నారాయణ మీడియాకు వెల్లడించారు.' రాజధాని అమరావతిపై వైసీపీ నేతలకు ఇంకా కక్ష తీరలేదా? అమరావతిపై వైసీపీ నేతలు కక్ష కట్టారు. అందుకే ఐదేళ్లూ రాజధాని ఊసులేకుండానే పాలించారు. ఇంత త్వరగా అమరావతి అభివృద్ధి పనులు చేపడతామని ఎవరూ ఊహించలేదు. ముఖ్యంగా వైసీపీ నేతలు అసలే నమ్మలేదు. ల్యాండ్ పూలింగ్ ప్రక్రియలో భాగంగా రైతుల భాగస్వామ్యంతోనే రాజధాని నిర్మాణాలు చేపడుతున్నాం. ముఖ్యంగా రాజధాని ప్రాంతానికి వరద తాకిడి వచ్చినా తట్టుకునే స్థాయి నిర్మాణాలు చేపడుతున్నాం. కృష్ణా కరకట్టలను కట్టుదిట్టంగా నిర్మిస్తున్నాం. భవిష్యత్తులో ఎంత పెద్ద వర్షాలు, వరదలొచ్చినా తట్టుకుని నిలబడేలా రాజధాని నిర్మాణం చేపట్టబోతున్నాం.ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అమరావతి రూపుదిద్దుకోనుంది. ఐకానిక్ బిల్డింగ్స్‌తో హైకోర్టు, అసెంబ్లీ బిల్డింగ్స్‌కు, ఎలక్ట్రానిక్ అండర్ గ్రౌండ్స్ నిర్మాణాలకు 47 వేల కోట్లకు పైగా పనులకు ఆమోదం లభించింది. రాజధాని నిర్మాణం, దాని నాణ్యతపై ఎవరికీ ఎలాంటి అపోహలు వద్దు. రాష్ట్రంలో ఉన్న అన్ని పోర్టుల ప్రక్షాళన ప్రారంభమైంది. రాబోయే రోజుల్లో పర్యాటకంగా పోర్టులను, సముద్ర తీర ప్రాంతాలను అభివృద్ధి చేస్తాం' అని మంత్రి నారాయణ తెలిపారు. వచ్చే ఏడాది జూన్ 12 కల్లా 1.18 లక్షల టిడ్కో గృహ నిర్మాణాలను పూర్తి చేసి, ప్రారంభిస్తాం. ఇప్పటికే బ్యాంకు రుణాలు తీసుకుని నాన్ పెర్ఫార్మింగ్ అస్సెట్స్‌గా మిగిలిపోయిన టిడ్కో గృహాలను పూర్తి చేయడానికి రూ.102 కోట్లను చెల్లించేందుకు సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపారు. 2014-19 మధ్యకాలంలో కేంద్ర ప్రభుత్వంచే 7,01,481 టిడ్కో గృహాలను మంజూరు చేయించి, వాటిలో 5.00 లక్షల గృహాలకు పరిపాలనాపరమైన అనుమతులను కూడా మంజూరు ప్రక్రియ కూడా పూర్తయ్యింది. వాటిలో 4,54,706 గృహాలను గ్రౌండ్ చేయడం జరిగింది. ఇందులో 2019 నాటి 3,13,832 గృహ నిర్మాణాలను ప్రారంభించాం.ప్రతి యూనిట్ నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి మొత్తం రూ.3.90 లక్షలు ఇచ్చేందుకు నిర్ణయించాం. ఇందులో రూ.1.90 లక్షలు కేంద్ర ప్రభుత్వం, మిగిలిన సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చేలా నిర్ణయించడం జరిగింది. అదే విధంగా లబ్దిదారుని వాటాగా చెల్లించాల్సిన సొమ్మును బ్యాంకు రుణంగా ఇప్పించేందుకు చర్యలు చేపట్టాం. కానీ, ప్రభుత్వం మారడంతో ఈ ప్రక్రియను అంతా గందరగోళమైంది. టీడీపీ ప్రభుత్వం టెండర్లు పిలిచి నిర్మాణానికి చేపట్టిన 4,54,706 గృహాలలో కేవలం 2,61,640 గృహాలను మాత్రమే గత ప్రభుత్వం చేపట్టి మిగిలిన వాటిని రద్దు చేయడం జరిగింది. ఆ చేపట్టిన గృహాలను కూడా గత ప్రభుత్వం పూర్తి చేయలేదు.ఈ గృహాలలో దాదాపు 77 వేల గృహాలను మా ప్రభుత్వమే పూర్తి చేయడం జరిగింది. లబ్దిదారులకు మంజూరు చేసిన గృహాలపై గత ప్రభుత్వం బ్యాంకు రుణాలను తీసుకొని, ఆ సొమ్మును డైవర్ట్ చేసింది. ఫలితంగా ఆయా గృహాలు నాన్ పెర్ఫార్మింగ్ అస్సెట్స్‌గా మిగిలిపోయాయి. ఈ సమస్య నుంచి బయటపడాలంటే రూ.102 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఆ సొమ్మును ప్రభుత్వం చెల్లించేందుకు ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు. వీటిలో దాదాపు 1.18 లక్షల గృహా నిర్మాణాలను వచ్చే ఏడాది జూన్ 12 కల్లా పూర్తిచేసి ప్రారంభించేందుకు చర్యలు చేపడుతాం' అని మంత్రి నారాయణ వెల్లడించారు.ఆచార్య నాగార్జున వర్సిటీలో రాష్ట్రస్థాయి కార్యశాల నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 123 మంది పురపాలక కమిషనర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భవన నిర్మాణాల కోసం ఐదు అంతస్తుల వరకు ఎలాంటి అనుమతులు అవసరం లేదన్నారు. ' భవన నిర్మాణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే సరిపోతుంది. లేఅవుట్, భవనాలకు సంబంధించి మున్సిపాలిటీకి రుసుము చెల్లిస్తే అనుమతులన్నీ ఇస్తాం. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ పట్టణాల్లో రోడ్లు, తాగునీరు, వీధిదీపాలు, వరదనీరు, ఘనవ్యర్థాల నిర్వహణ తదితర అంశాలపై 15 రోజుల్లో డీపీఆర్ రూపొందించాలని అధికారులను ఆదేశించాం. పాతపన్ను బకాయిల వసూళ్లకు చర్యలు తీసుకోవాలి. నెల్లూరు, కాకినాడ, రాజమండ్రిలో ఘనవ్యర్థాల నిర్వహణకు అనుమతి వచ్చింది. ప్రభుత్వం చేపడుతున్న చర్యలతో చెత్త సమస్య పరిష్కారమవుతోంది' అని మంత్రి తెలిపారు.బీసీలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి పెట్టారు. ఈ సందర్బంగా నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని నిర్ణయించారు. బీసీ హాస్టళ్లలో వసతుల కల్పన, బాలికల హాస్టళ్ల తక్షణ మరమ్మతులకు ముఖ్యమంత్రి ఆదేశించారు. బీసీల రక్షణ కోసం ప్రత్యేక రక్షణ చట్టం తెస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. ఈ మేరకు కూటమి ప్రభుత్వం మంత్రుల కమిటీని ఏర్పాటు చేసింది. మంత్రుల కమిటీ ప్రాథమికంగా ఇచ్చిన సూచనలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మరికొంత కసరత్తు తరువాత సాంకేతిక, న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తకుండా ఈ చట్టాన్ని తీసుకురావాలని అధికారులకు సూచించారు.

# మంత్రి ఫరూక్ కు కృతజ్ఞతలు తెలిపిన ట్రాన్స్ జెండర్స్

నంద్యాలస్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం (రాజ్ టాకీస్) నందు గౌరవ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ని ఇండియన్ నేషనల్ సమతా హైజాదస్ ఐక్య పోరాట సమితి నాయకులు పిడేసేలా విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా మంత్రి ఫరూక్ ను , నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ ని సన్మానించుకొని కృతజ్ఞతలు తెలుపడం జరిగిందిఈ సందర్భంగా మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ ట్రాన్స్ జెండర్స్ ను అన్ని విధాలుగా తెలుగుదేశం పార్టీ అండదండలుగా ఉంటుందని గతంలో తెలుగుదేశం పార్టీ హయాంలో ఇళ్లస్థలాలు ఇవ్వడం జరిగిందని అలాగే ఇప్పుడు కూడా ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి హౌసింగ్ ద్వారా లోన్లు ఇప్పిస్తామని అదేవిధంగా వారికి కావాల్సిన అన్ని సదుపాయాలను ఏర్పాటు చేస్తామని ఏ ప్రభుత్వం చేయని విధంగా ట్రాన్స్ జెండర్స్ కు 4000 పింఛన్ ఇచ్చిన ఘనత తెలుగుదేశం పార్టీకే చెందుతుందని తెలిపారు అలాగే భవిష్యత్తులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారితో మాట్లాడి తెలంగాణ రాష్ట్రంలో ఏ విధంగా అయితే ట్రాన్స్ జెండర్స్ కు ట్రాఫిక్ కానిస్టేబుల్ పోస్టులు ఇచ్చారు అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ లో కూడా ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చే విధంగా వారితో చర్చిస్తామని తెలిపారుఈ కార్యక్రమంలో ట్రాన్స్ జెండర్స్ పార్వతమ్మ , ఉమా , షేక్ బాషా , చల్ల గీత , గౌరమ్మ , వెలుగోడు అనిత , షేక్ ఉస్మాన్ , చార్మి , షేక్ మౌలాలి , సారధి , పూజ , షేక్ లింగాపురం మౌలాలి , లోకేష్ గౌడ్ , అమ్ములు , గంగ , స్వప్న , కే నీలిమ , డి సరోజమ్మ తదితరులు పాల్గొన్నారు.

# నీతి నిజాయితీకి, క్రమశిక్షణకు మారుపేరు బిజివేముల వీరారెడ్డి

**మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, నియోజకవర్గ ఇంచార్జ్ రితీష్ రెడ్డి ఆధ్వర్యంలో నేడు 24వ వర్ధంతి**

**ఉమ్మడి రాష్ట్రంలో మూడుసార్లు మంత్రిగా పనిచేసిన వీరారెడ్డి**

**టిడిపి నేత కూటమి నేత మంచూరు సూర్యనారాయణ రెడ్డి**

బద్వేలు,కడప ఉమ్మడి జిల్లారాజకీయాలను 24 సంవత్సరాల క్రితం వరకు శాసించిన దివంగత మాజీ మంత్రి బిజివేముల వీరారెడ్డి వర్ధంతి వేడుకలు బుధవారం బద్వేల్ పట్టణం శ్రీ బీవీఆర్ విద్యాసంస్థల ప్రాంగణం లో ఉన్న వీరారెడ్డి ఘాట్ వద్ద ఘనంగా జరగనున్నాయి. వీరారెడ్డి వర్ధంతి వేడుకలకు తెలుగుదేశం పార్టీకి చెందిన కార్యకర్తలు ,అభిమానులు, నాయకులు తో పాటు జిల్లాలోని పలువురు ముఖ్య నాయకులు తదితర కూటమి శ్రేణులంతా ఆయన వర్ధంతి వేడుకలకురానున్నారని బద్వేల్ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ప్రజా నాయకుడు ప్రముఖ రైల్వే క్లాస్ వన్ కాంట్రాక్టర్ మంచూరు.సూర్యనారాయణ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి హాజరుకానున్నారు. వీరారెడ్డి రాజకీయ ప్రస్థానం పంచాయతీ బోర్డు సభ్యులు నుంచి గ్రామ సర్పంచ్ అయినారు. ఆ తర్వాత పోరుమామిళ్ల సమితి ప్రెసిడెంట్గా తొలి దప ఓటమి చెందారు. అనుంచి ఎమ్మెల్యేగా, సెంట్రల్ బ్యాంక్ చైర్మన్ గా, పోరుమామిళ్ల సమితి ప్రెసిడెంట్గా ఒకేసారి మూడు పదవులు నిర్వర్తించి రాష్ట్రంలోనే ఏకైక ఎమ్మెల్యేగా పేరు తెచ్చుకున్నారు. అనంతరం రాష్ట్ర మంత్రిగా ఆయన ఎదిగారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆయన మూడుసార్లు మంత్రిగా పనిచేశారు. మంత్రిగా ఉండగా మరణించడంవిషయం అప్పట్లో రాష్ట్రమంతా ఒక కుదుపు కుదిపేసింది. తెలుగుదేశం పార్టీలో నీతి నిజాయితీలకు వీరారెడ్డి మారుపేరు అని చెప్పాలి.తెల్లవారుజామున నాలుగు గంటలకు ఆయన రాజకీయ జీవితం మొదలవుతుంది. తిరిగి రాత్రి 11 గంటల వరకుతన అనుచరులతో రాజకీయ చర్చలు కొనసాగిస్తుంటారు. రాష్ట్ర మంత్రిగా ఉన్నప్పుడు ఆయన ధ్యాసంతా బద్వేల్ నియోజకవర్గం అభివృద్ధి పైనే ఉంటుంది. వీరారెడ్డిని దగ్గరగా చూసినవారికి గంభీరంగా కనిపించినా శృతి మెత్తని మనసత్వం వీరారెడ్డిది.ఎవరికైనా మాటిస్తే ఆ పని పూర్తయ్యే వరకు నిద్ర పోరు. క్రమశిక్షణకు మారుపేరు వీరారెడ్డి సమయపాలనకు ఎక్కువ విలువ ఇస్తారాయన. బద్వేల్ ప్రాంతానికి సాగు, త్రాగునీరు కావాలని అప్పటి దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు వద్ద పట్టు పట్టి బ్రహ్మంగారి మఠం సమీపంలో తెలుగు గంగ రిజర్వాయర్ కు శంకుస్థాపన చేయించారు. వీరారెడ్డి అంటే ఉడుము పట్టు అనే పేరు ఇప్పటికీ ఉంది. దివంగత వీరారెడ్డి దయతో జిల్లాలో ఎంతోమంది రాజకీయంగా ఉన్నత పదవులు పొందారు. 2000 డిసెంబర్ 25 సరిగ్గా అంటే 24 సంవత్సరాల క్రితం మంత్రి హోదాలో వీరారెడ్డి మృతి చెందారు. అప్పటి నుంచి వీరారెడ్డి వర్ధంతి వేడుకలు ఆయన ఏకైక కుమార్తె మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, ఆయన మనమడు యువ నాయకుడు రితీష్ రెడ్డి తాతకు తగ్గ మనవడిగా ప్రతి ఏటా క్రమం తప్పకుండా వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తుండేవారు. ఆయనకు గుర్తుగా బద్వేల్ పట్టణంలో నాలుగు రోడ్ల కూడలిలో కాంస్య విగ్రహం ఏర్పాటు చేశారు.

# వీపీఆర్ కు ధన దాహం తీరలేదు

**ఎంపి వేమిరెడ్డి పై శిరిషా మండిపాటు**

తిరుపతి,మాజీ సంగీత అకాడమీ చైర్మెన్ పొట్టేళ్ల శిరీష యాదవ్ గూడూరు లో మీడియా సమావేశం నిర్వహించి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పై ఆరోపణలు చేసారు. గత ఆరు నెలలుగా మైనింగ్ ఆగిపోవడానికి వీపీఆర్ స్వార్థ రాజకీయాలు చేస్తున్నారు. వీపీఆర్ వల్ల మైకా గనుల్లో పనిచేసే వేలాదిమంది కార్మికులు ఉపాధి లేక రోడ్డును పడ్డారు. వేల కోట్లు ఆస్తులు ఉన్నా కూడా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి ధన దాహం ఇంకా తిరలేదు. విపిఆర్ మాత్రం మైనింగ్ కు నాకు సంబంధం లేదని చెబుతూనే తన అనుచరుడు ద్వారా మొత్తం వ్యవహారం నడిపిస్తున్నాడని ఆరోపించారు.వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అనుచరుడు బెట్టింగ్ రాజా సైదాపురం మండలంలో మైనింగ్ ఆఫీస్ ఎందుకు ఏర్పాటు చేస్తున్నారు. విపిఆర్ అనుచరుడు మైనింగ్ చేసేవారిని బెదిరింపులకు గురిచేస్తున్నాడు. విపిఆర్ సతీమణి టిటిడి మెంబర్, ఇక్కడ చూస్తే విపిఆర్ మాత్రం వేలమంది జీవితాలను నాశనం చేస్తున్నారని ఆరోపించారు.

# ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు దుర్మరణం

శ్రీకాకుళం,కంచిలి మండలం పెద్ద కొజ్జియా జంక్షన్ సమీప జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. జైలో వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న కరెంటు స్తంభాన్ని అతివేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ఘటనా స్థలంలో ముగ్గురు మృతి చెందగా... మరో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న నేషనల్ హైవే సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన వ్యక్తులను చికిత్స నిమిత్తం సోంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విశాఖ నుంచి జాజ్పూర్ దుర్గామాత ఆలయ దర్శనానికి వెళుతుండగా ఈ ఘటన చోటు చేసుకుందని పోలీసులు తెలిపారు.మృతుల వివరాలు: కదిరిశెట్టి సోమేశ్వరరావు(48) ఎం లావణ్య(43), స్నేహగుప్తా(18) దుర్మరణం పాలయ్యారు. విశాఖపట్నం సీతమ్మధార నుండి ఒరిస్సాలోని జాజిపూర్ అమ్మవారి దర్శనానికి వెళుతుండగా మార్గమధ్యలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

# వర్షంలో ధాన్యం రైతు కంట కన్నీరు

అమరావతి,స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ధాన్యం విషయంలో నిర్లక్ష్యం వహించవద్దు. కల్లం లోకి రాంగానే కొనేయండి అని అధికారులను ఆదేశించినా తాడేపల్లి మండల అధికారుల నిర్లక్ష్యం బయటపడింది. ఉండవల్లి గ్రామ రైతులు వరి ధాన్యాన్ని దేవాదాయ శాఖ భూముల్లో పోసి వర్షాలు పడే విధంగా ఉన్నాయి త్వరగా ధాన్యాన్ని కొనండి అని రైతు భరోసా అధికారులను అడగగా అధికారులు చాలా నిర్లక్ష్యంగా ధాన్యంలో అక్కడక్కడ మట్టి గడ్డలు ఉన్నాయి అవి కూడా తొలగించి రండి అని నిర్లక్ష్యపు సమాధానం ఇవ్వడంతో రైతులు కంగు తిన్నారు. ఉండవల్లి అధికారుల నిర్లక్ష్యానికి వానలో ధాన్యం తడిసింది.

## జిల్లా ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెల్పిన ... కర్నూలు జిల్లా ఎస్పీ శ్రీ జి. బిందు మాధవ్



విభారే న్యూస్. డిసెంబర్ 24. కర్నూల్ (ప్రతినిధి నేడు)క్రిస్మస్ పండుగ సందర్భంగా కర్నూలు జిల్లా ప్రజలకు, పోలీసు అధికారులకు, సిబ్బంది కి, వారి కుటుంబ సభ్యులకు కర్నూలు జిల్లా ఎస్పీ శ్రీ జి. బిందు మాధవ్ ఐపియస్ క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలను మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రిస్మస్ పండుగ ఏసుక్రీస్తు యొక్క గొప్ప జీవితాన్ని మరియు ఆయన కరుణ మరియు క్షమాపణ సందేశాన్ని , నిత్య సత్యాన్ని విలువలను నిలబెట్టడానికి ఆయన పడిన కష్టాలను ప్రజలకు గుర్తు చేస్తుందన్నారు. క్రిస్మస్ పండుగ జిల్లా ప్రజలందరికీ ఆనందం, శాంతి మరియు శ్రేయస్సును తీసుకురావాలని ఈ సంధర్భంగా కర్నూలు జిల్లా ఎస్పీ శ్రీ జి. బిందు మాధవ్ ఐపియస్ తెలిపారు.

## అమిత్ షా గారిని మంత్రి పదవి నుండి తొలగించాలి

**జిల్లా కలెక్టర్ గారికి మెమోరాండం**
**జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పరిగెల మురళీకృష్ణ**



విభారే న్యూస్ డిసెంబర్ 24 కర్నూలు ప్రతినిధి అమిత్ షాను కేంద్ర మంత్రి పదవి నుండి తక్షణమే తొలగించాలని కర్నూల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పరిగెల మురళీకృష్ణ డిమాండ్ చేశారు. అఖిలభారత కాంగ్రెస్ కమిటీ పిలుపుమేరకు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు శ్రీమతి వైఎస్ షర్మిల రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం కర్నూలు జిల్లా కలెక్టర్ పి రంజిత్ భాష ని ఆయన చాంబర్లో కలిసి మెమోరాండం సమర్పించారు. మురళీకృష్ణ మాట్లాడుతూ రాజ్యసభలో కేంద్ర మంత్రి అమిత్ షా భారతరత్న, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేశారని గత వారం రోజులుగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టుచున్నామని అందులో భాగంగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కి కర్నూలు జిల్లా కలెక్టర్ ద్వారా అమిత్ షా ని మంత్రి పదవి నుండి తక్షణమే తొలగించాలని కోరుతూ మెమోరాండం ఇవ్వడం అయినదని మురళి కృష్ణ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎన్ సి బజారన్న, అనంతరత్నం మాదిగ, షేక్ మాలిక్, సయ్యద్ నవీద్, డివి సాంబశివుడు, మహిళా కాంగ్రెస్ ఎస్ ప్రమీల మొదలగువారు కలెక్టర్ ని కలిసి మెమోరాండం సమర్పించారు.

## మృతి పట్ల సంతాపం తెలిపిన గౌతమ్ రెడ్డి....

విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి:-సెంబరీ 24 డోన్ మండల పరిధిలోని యు కొత్తపల్లె గ్రామంలో టీచర్ ఎన్ఎస్ బాబు తమ్ముని కుమారుడు రామిజ్ రాజా యాక్సిడెంట్ కారణంగా మరణించడంతో తెలుగుదేశం యువ నాయకులు ధర్మవరం మన్నే గౌతమ్ కుమార్ రెడ్డి ఆ భౌతిక కాయాన్నికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్ధించారు.



# వాస్తవాలు రాస్తున్న జర్నలిస్ట్ లపై అక్రమకేసులు మానుకోవాలి.



**జర్నలిస్ట్ లపై కేసులు పెట్టడం పత్రిక గొంతు నొక్కడమే.**
**ఏపీడబ్ల్యూజేఎఫ్, జర్నలిస్ట్ ల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు ధర్నా**

విభారే న్యూస్. డిసెంబర్ 24..కర్నూల్ ప్రతినిధి జిల్లాలో పని చేస్తున్న జర్నలిస్టులకు పోలీస్ అధికారులు నోటీస్ లు ఇవ్వడం హేయమైన చర్య ఇలాంటి నోటీసులు ఇవ్వడం పోలీస్ లు మానుకోవాలని పత్రిక స్వేచ్ఛను హరించడం తప్ప ఇంకొకటి కాదని ఏపీడబ్ల్యూజేఎఫ్ ,జర్నలిస్ట్ ల ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గోరంట్లప్ప, కె.బి శ్రీనివాసులు,జిల్లా కన్వీనర్ నాగేంద్ర ,ఫోటో గ్రాఫర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు డి.హుస్సేన్, సీనియర్ జర్నలిస్టు సత్యనారాయణ గుప్తా,సాక్షి బ్యూరో రవి వర్మ,ఎన్. టివి కరస్పాండెంట్ చంద్రశేఖర్, టివి 9 కరస్పాండెంట్ నాగిరెడ్డి,సాక్షి కరస్పాండెంట్ లోకేష్,వార్త స్టాఫ్ రిపోర్టర్ రవి ప్రకాష్, సీనియర్ జర్నలిస్ట్ లు నీలం సత్యనారాయణ,అవినాష్, లు మాట్లాడుతూ గత నెల ఆదోని,కర్నూలు పత్తికొండ లో పని చేస్తున్న వివిధ పత్రికల జర్నలిస్టులు రాసిన వార్తలకు నోటీస్ లను ఇచ్చారు.అదోనిలో వన్ టౌన్ పోలీసులు మామూళ్లు వసూళ్లు చేస్తున్నారని ప్రజాశక్తి దినపత్రికలో రాసిన వార్తకు స్టాఫ్ రిపోర్టర్ వినయ్ కుమార్ కు ఆదోని వన్ టౌన్ వారు,ఆదోని రూరల్ పోలీస్ వారు నోటీస్ లు ఇచ్చారు.అలాగే కర్నూలు నగరంలోని మూడవ పోలీస్ స్టేషన్ పరిధిలో నవంబర్ 11న బోరుగడ్డ అనిల్ కు మళ్ళీ రాచ మర్యాదలే శీర్షికతో రాసినందుకు వార్త దినపత్రిక స్టాఫ్ రిపోర్టర్ రవి ప్రకాష్ కు పోలీస్ లు నోటీస్ లు ఇచ్చారు. ఆలూరు లో టివి 9 ,పత్తికొండ లో ఆంధ్రప్రభ,హంస వాయిస్,విశాలాంధ్ర, జర్నలిస్టులకు నోటీస్ లు ఇచ్చారు. నేడు పోలీస్ లే కిడ్నపర్స్ అవతారం ఎత్తి అనే శీర్షికతో సాక్షి దినపత్రికలో రాసిన వార్త కు సాక్షి జర్నలిస్ట్ కె.బి శ్రీనివాలుకు పోలీస్ లు నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేయడం బెదిరింపులకు గురిచేయడం తప్ప ఇంకొకటి కాదు. ఇదే వార్తను పలు రకాల చానల్స్, పేపర్స్ లలో ప్రచురణ జరిగింది.కానీ కేవలం సాక్షి జర్నలిస్టుల పై కేసులు నమోదు చేయడం టార్గెట్ చేయడం భయబ్రాంతులకు గురిచేయడం తప్ప ఇంకొకటి కాదన్నారు.వాస్తవాలు రాసిన జర్నలిస్టులకు నోటీస్ లు ఇవ్వడం అంటే ప్రజల గొంతు పత్రిక స్వేచ్ఛ ను హరించడం తప్ప ఇంకొకటి కాదన్నారు.వాస్తవాలు రాస్తున్న జర్నలిస్టులను



బెదిరింపులకు గురిచేయడం కోసమే ఇలాంటి నోటీసులు ఇస్తున్నారని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నామన్నారు. ఇలాంటి ధోరణి ని పోలీస్ అధికారులు చేయడం బాధాకరం.వార్తలు రాసిన వాటిపై విచారణ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం మానేసి పత్రిక గొంతు నొక్కడం సమంజసం కాదని తెలిపారు.జర్నలిస్టుల రక్షణ కోసం పోలీస్ లు హామీ ఇచ్చేలా వ్యవహరించాలని విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు.తక్షణమె ఇలాంటి చర్యలు విరమించుకోవాలని డిమాండ్ చేశారు.ఇప్పటికే ఈ ఘటనలపై జర్నలిస్ట్ సంఘాలు తీవ్ర ఆందోళనలో చేస్తున్నారని రాబోవు రోజుల్లో ఇలాంటి సంఘటనలు జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.అనంతరం డిఆర్వో వెంకట నారాయణమ్మ కు వినతిని అందించారు.ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ కో కన్వీనర్ రమేష్, సీనియర్ జర్నలిస్ట్ లు రాజశేఖర్ నాయుడు,శ్రీనాథ్ రెడ్డి, విజయ్ కుమార్,శివ శంకర్, ఉరుకుందు, రామకృష్ణప్రతాప్,శ్రీనివాసులు,విజయ కరణ్,దామోదర్,అనిల్,శేఖర్, జర్నలిస్ట్ లు తదితరులు పాల్గొన్నారు.

## జనవరి వేడుకలను పూల మొక్కలతో జరుపుకుందాం---



**రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఫరూక్ - -**

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 24--రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ముద్రించిన "జనవరి వేడుకలను పూల మొక్కలతో జరుపుకుందాం" అనే బ్యానర్లను రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఆవిష్కరించారు. జనవరి శుభాకాంక్షలు తెలియజేయడానికి విచ్చేసే తన అభిమానులు, కార్యకర్తలు శ్రేయోభిలాషులు అందరూ స్వీట్స్, పూలదండలు, బొకేలు కాకుండా పూల మొక్కలతో, నోటు పుస్తకాలతో శుభాకాంక్షలు తెలియజేయాలని మంత్రి ఫరూక్ సూచించారు. రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో పూల మొక్కలతో, నోటు పుస్తకాలతో జనవరి వేడుకలు జరుపుకుందామని ఏర్పాటుచేసిన బ్యానర్లను ఆవిష్కరించే కార్యక్రమంలో మంత్రి ఫారుక్ తో పాటు పాల్గొన్న తెలుగుదేశం నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ మన నంద్యాల పట్టణంలో ప్రతి ఒక్కరం పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని, జనవరి ఒకటో తారీఖున ప్రతి ఒక్కరం ఒక మొక్క నాటాలని పిలుపునిచ్చారు. ఈ విషయంలో రెడ్ క్రాస్ సంస్థ చాలా సంవత్సరాలుగా కృషి చేస్తుందని, మరియొకసారి జిల్లా ప్రజలందరికీ ఈ విషయమై అవగాహన కల్పిస్తున్న రెడ్ క్రాస్ వారికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నంద్యాల జిల్లా చైర్మన్ దస్తగిరి పర్ల, వైస్ చైర్మన్ మారుతి కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఉస్మాన్ భాష, ఆర్గాన్ డొనేషన్ మోటివేషన్ కోఆర్డినేటర్ ఆనంద్ గురూజీ, రెడ్ క్రాస్ జిల్లా కోఆర్డినేటర్ అబ్దుల్ సమీ తదితరులు పాల్గొన్నారు.

## కరెంటు చార్జీల పెంపుపై నిరసన కు పోస్టర్ విడుదల---



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 24--కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఆరు నెలల కాలంలోనే ప్రజలపై విద్యుత్ భారాన్ని మోపిందని పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించేందుకు ప్రభుత్వాన్ని మెడలు వంచేందుకు వైఎస్ఆర్సిపి చేపడుతున్న పోరు బాటలో వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు విద్యుత్ వినియోగదారులు ప్రజలు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ ఇస్సాక్ బాష, మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నీసా, వై ఎస్ ఆర్ సి పి నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి నివాసంలో వైఎస్ఆర్సిపి అధినేత మాజీ ముఖ్యమంత్రి వై.యస్. జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, ప్రజలపై విద్యుత్ చార్జీల అదనపు భారాన్ని మోపుతున్న కూటమి ప్రభుత్వ వైఖరికి నిరసనగా, డిసెంబర్ 27వ తేదీన పార్టీ శ్రేణులు, ప్రజలతో సంయుక్తంగా ర్యాలీగా వెళ్లి విద్యుత్ శాఖ కార్యాలయం లో ఆ శాఖ అధికారులకు వినతిపత్రం సమర్పిం సమర్పించే కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎమ్మెల్సీ ఇస్సాక్ బాషా మున్సిపల్ చైర్ పర్సన్ మా బున్నీ సా, వైఎస్ఆర్ పార్టీ నాయకుల సమక్షంలో కరెంటు చార్జీల బాదుడుపై వైయస్సార్సీపి అనే పోస్టర్ ను ఆవిష్కరణ చేయడం జరిగిందన్నారు . ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## వాటర్ షెడ్ పనులు పరిశీలన



**జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా**

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 24--భూగర్భ జలాలను పెంచడమే వాటర్ షెడ్ ముఖ్య ఉద్దేశ్యము జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి అన్నారు. మంగళవారం సంజామల మండలంలోని ఆకుమల్ల గ్రామంలో వాటర్షెడ్ పథకం కింద చేపట్టిన చెక్ డాములు, ఫారం ఫండ్స్, మినీ పర్కులేషన్ ట్యాంకులు, గార్బేజ్ స్ట్రక్చర్లు తదితర పనులను పరిశీలించారు. అనంతరం గ్రామ సచివాలయంలో వాటర్ షెడ్ కమిటీ సభ్యులతో సమావేశమై వాటర్ షెడ్ వల్ల కలిగే ప్రయోజనాలను కలెక్టర్ వివరించారు. అట్టడుగున ఉన్న భూగర్భ జలాలను పైకి తీసుకురావడానికి వాటర్ షెడ్లు ఉపయోగపడతాయన్నారు. భూమిపై పడ్డ వర్షపునీరు వృధాగా పోకుండా ప్రతి నీటి బిందువును భూమిలోకి ఇంకింప చేసి భూగర్భ జలాలను పెంచడమే వాటర్ షెడ్ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కొండలు, వాగు వంకల నుండి నీటిని సంరక్షించి నీటి నిల్వకుంటలు, పొలాల నుండి మట్టి కొట్టుకుపోకుండా అడ్డుగా రాతి కట్టలు, ఇరువైపులా మొక్కలు నాటడం, చెట్లు పెంచడం కందకాల త్రవ్వకం, ఊట కుంటలు, దగవుట్ ఫాండ్స్, ఇంకుడు గుంతలు తదితర పనులు చేపట్టి నీటిని సంరక్షించుకొని అవసరమైనప్పుడు పొలాలకు వినియోగించుకోవచ్చున్నారు. ఉపాధి హామీ కింద చేపట్టే పనులు కమిటీ సభ్యుల ఆమోదంతో ప్రతిపాదనలు పంపాలన్నారు. డ్వామా పిడి జనార్దన్ రెడ్డి, వాటర్ షెడ్ అడిషనల్ పిడి మాధవీలత, ప్రాజెక్ట్ ఆఫీసర్ విజేత, గ్రామ సర్పంచ్, ఎంపీడిఓ,ఏపీడి, ఎపిఓ తదితరులు కలెక్టర్ వెంట పాల్గొన్నారు.

## ట్రేడ్ లైసెన్స్ లను రెన్యువల్ చేయించండి---

**కమిషనర్ నిరంజన్ రెడ్డి--**

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 24-నంద్యాల పట్టణంలో వర్తక వాణిజ్య వ్యాపారస్తులను ట్రైడ్ లైసెన్స్ లను రెన్యువల్ చేపించాలని. వర్తకులకు అవగాహన కల్పించాలని సచివాలయ సిబ్బంది కి కమిషనర్ నిరంజన్ రెడ్డి సూచించారు . మంగళవారం 30 వార్డు ఎమ్ ఎస్ నగర్ సచివాలయంను ఆకస్మిక తనిఖీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ వర్తకులు వ్యాపారులు యొక్క ట్రేడ్ లైసెన్స్ రుసుములను సకాలంలో చెల్లించాలన్నారు . ట్రేడ్ లైసెన్స్ లను సకాలంలో రెన్యూవల్ చేయించుకోవాలని సూచించారు . స్కూల్స్, కాలేజీలు, హాస్పిటల్స్, బార్ అండ్ రెస్టారెంట్లు, హోటల్స్ ప్రతి సంవత్సరము నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ . శానిటేషన్ సర్టిఫికేట్ తీసుకోవాలన్నారు . అలాగే కొత్త వ్యాపారం ప్రారంభించిన వారు మునిసిపాలిటీ నుండి ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలన్నారు. మున్సిపల్ అధికారులు విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అదికారులు తనిఖీలు నిర్వహించినప్పుడు ట్రేడ్ లైసెన్స్ లేని యడల చట్టపరమైన చర్యలు తీసుకొంటామని తెలిపారు . వార్డులో జరుగుతున్న పనులను పరిశీలించారు.

## భరత్ దంపతులకు పెళ్లి రోజు శుభాకాంక్షలు తెలిపిన తెలుగుయువత నాయకులు...



విబారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :-డిసెంబర్ 24 తెలుగుదేశం యువ నాయకులు మన్నే భరత్ కుమార్ రెడ్డి మన్నే కావ్య పెళ్లి రోజు సందర్భంగా వారికి పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలిపిన డోన్ మండలం టిడిపి తెలుగుయువత అధ్యక్షులు కోనేటి కాశీ విశ్వనాథ్, తెలుగుయువత నాయకులు ఎర్రిస్వామి గౌడ్, తెలుగుయువత నాయకులు గుండాల జగన్.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190